సాక్షి రంగారెడ్డి

మంగళవారం, 18, ఏప్రిల్, 2023



మనమే ఆదర్శం

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశంలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. 8లో▸



వ్యవసాయం లాభదాయకం

వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆధునిక పద్ధతుల్లో సాగు చేయాలని వ్యవసాయ శాస్త్ర వేత్తలు సూచించారు. 8లో▸

20న ఇంటర్వ్యూలు

ఇబ్రహీంపట్నం: స్వయం ఉపాధి రుణాల కోసం మైనార్టీ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 20న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి మీ సేవ ద్వారా ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు తమ అర్హత ధ్రువపత్రాలతో మండల పరిషత్ కార్యాలయానికి ఉదయం పదిన్నర గంటలకు హాజరు కావాలని సూచించారు. సంబంధిత అధికారులు హాజరై లబ్ధిదారుల ఎంపిక నిర్వహిస్తారన్నారు.



న్యూస్‌రీల్

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్ రూరల్: అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 49లోని ప్రభుత్వ భూమి కబ్జాపై 'సర్కారు భూమికి ఎసరు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వ స్థలానికి హద్దులు పాతారు.కూల్చివేతల్లో తహసీల్దార్ అశోక్‌కుమార్, డీటీ వినయ్‌కుమార్, ఆ ర్‌ఐ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు.

గ్రంథాలయ భవనానికి అదనపు నిధులు



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

ఆమనగల్లు: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న మోడల్ గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు అదనంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వారా రూ.25.20 లక్షలు మంజూరు చేసినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ఆమనగల్లులో రూ.కోటితో మోడల్ గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. భవనం అసంపూర్తి పనులకు రూ.25.20 లక్షలు మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. గ్రంథాలయ ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు, వివిధ అసంపూర్తి పనులకు రూ.15.20 లక్షలు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి నెల రోజుల్లో వినియోగంలోకి తేవడానికి కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సిఫారసు మేరకు మాడ్గులలో గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.65 లక్షలు మంజూరు చేశామని, కడ్తాల్‌లో గ్రంథాలయ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఆరు పౌర పట్టణకేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కమటం రాధమ్మ, కార్యదర్శి మనోజ్‌కుమార్, లైబ్రేరియన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అమర్‌నాథ్ యాత్రకు మెడికల్ సర్టిఫికెట్ల జారీ

గాంధీఆస్పత్రి: అమర్‌నాథ్ యాత్రికులకు మెడికల్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ప్రారంభమైంది. మెడికల్ బోర్డు ద్వారా ప్రతి మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు తెలిపారు. ప్రతి మంగళవారం 50 మందికి మాత్రమే సర్టిఫికెట్లు జారీ చేస్తున్నామని, ఎవరు ముందుగా దరఖాస్తు చేసుకుంటే వారికే వరుస క్రమంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

నేటి రాత్రి 10 గంటల నుంచి ఫ్లైఓవర్ల మూసివేత

సాక్షి, సిటీబ్యూరో: జగ్‌నే కీ రాత్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, రోడ్డుప్రమాదాలు జరగకుండా నగరంలోని ఫ్లైఓవర్లు మూసివేస్తున్నట్లు ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్ బాబు సోమవారం ప్రకటించారు. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ప్రత్యామ్నాయాలు లేని గ్రీన్ ల్యాండ్స్, లంగర్‌హౌస్ ఫ్లైఓవర్లు, పీవీఎస్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే మినహా మిగిలినవి మూసి ఉంటాయన్నారు. వీటితో పాటు పీవీఎస్ఆర్ మార్గ్ (నెక్లెస్ రోడ్) కూడా ఆ సమయంలో మూసేస్తున్నట్లు ప్రకటించారు. వాహనచోదకులు వీటిని దృష్టిలో పెట్టుకుని తమకు సహకరించాలని, ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా 90102 03626లో సంప్రదించాలన్నారు.

చేవెళ్లపై కమలం గురి

23న రానున్న అమిత్‌షా?

- ఏర్పాట్లలో పార్టీ శ్రేణులు
- ఉమ్మడి జిల్లా నుంచి పలువురి నేతల చేరిక!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భారతీయ జనతాపార్టీ ఎన్నికల సమరానికి సన్నద్ధం అవుతోంది. వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న కమల నాయకత్వం.. జిల్లాలో భారీ బహిరంగసభకు ప్లాన్ చేసింది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల లేదా వికారాబాద్‌లో ఈ నెల 23న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌ షా పర్యటన దాదాపు ఖరారు కావడంతో సభను సక్సెస్ చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలోనే సోమవారం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నివాసంలో జిల్లా పార్టీ నేతలు ప్రత్యేకంగా సమావేశమై.. అమిత్‌షా సభ ఏర్పాట్లను సమీక్షించారు.

చేరికలకు ముహూర్తం!

ఎలాగైనా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంపై పట్టు బిగించాలని ప్రయత్నిస్తున్న కాషాయదళం జాతీయ నాయకత్వాన్ని జిల్లాకు రప్పించి.. సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఇతర పార్టీలోని అసంతృప్తులను చేరదీయడం ద్వారా బలపడాలని యోచిస్తోంది. ఈ క్రమంలోనే కీలక నేతలకు గాలం వేస్తోంది. అమిత్ షా బహిరంగ సభలో ఓ మాజీ మంత్రిని చేర్చుకునేదిశగా ఎత్తులు వేస్తోంది. అయితే, ఆ మాజీ మంత్రి ఎవరనేది ఇప్పటి వరకు బీజేపీ నాయకత్వం వెల్లడించనప్పటికీ, అధికారపార్టీ అసంతుష్టులకు ఎర వేయడం ద్వారా గులాబీ శిబిరాన్ని కకావికలం చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఆ లోటును తీర్చేందుకు..

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో చేవెళ్ల సహా వికారాబాద్, తాండూరు, పరిగి, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. గతంలో ఇక్కడి నుంచి టీఆర్ఎస్ నుంచి గెలుపొందిన మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఏడాది క్రితం బీజేపీలో చేరారు. ఆయనతో పాటే అనేక మంది నేతలు వచ్చి చేరుతారని అంతా ఆశించారు. కానీ అలా జరగకపోవడంతో క్షేత్రస్థాయిలోని కేడర్ కొంత నిరుత్సాహానికి గురైంది. కేవలం పట్టణ ప్రాంతాల్లోనే కాదు మారుమూల గ్రామాల్లోనూ పార్టీకి అభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ.. అధికార బీఆర్ఎస్‌ను ఢీకొట్టి నిలబడే బలమైన నాయకత్వం లేకపోవడం సమస్యగా మారింది. అమిత్‌షా పర్యటనతో ఆ నాయకత్వ లేమి లోటును పూడ్చి.. సంస్థాగతంగా గట్టిపోటీ ఇవ్వాలని భావిస్తోంది. అమిత్‌షా సమక్షంలో జిల్లా నుం చి ఎవరెవరు పార్టీలో చేరబోతున్నారు? బహిరంగ సభ ఎక్కడ ఉంటుంది? వంటి అంశాలపై పార్టీ జిల్లా నేతలు ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడం విశేషం.



మహిళలకు పొదుపు ఖాతాలకు సంబంధించిన పాస్ పుస్తకాలను అందిస్తున్న కేంద్ర మంత్రి దేవుసింగ్ చౌహాన్

జూన్ నాటికి 400 మహిళా సమ్మాన్ ఖాతాలు

- కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి దేవుసిన్హా చౌహాన్
- కాన్హాలో మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ల కవర్ విడుదల

నందిగామ: దేశంలో మహిళల ఆర్థిక సాధికారత కోసం ఉద్దేశించిన మహిళా సమ్మాన్ పొదుపు పథకంలో భాగంగా జూన్ వరకు 400 ఖాతాలు తెరవడమే లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి దేవుసింగ్ చౌహాన్ అన్నారు. మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలో తపాలా శాఖ 75 సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా 2023-2024లో మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ల ప్రత్యేక క్యాంపెయిన్ కవర్‌ను శ్రీ రామచంద్ర మిషన్ గురూజీ, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమ్లేష్ పటేల్ (దాజీ)తో కలిసి సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. మహిళా సమ్మాన్ పొదుపు పథకం మహిళలకు అత్యంత లాభదాయకమైనదని వివరించారు. ఈ పథకాన్ని దేశం నలుమూలలకూ విస్తరిస్తామన్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఆధ్యాత్మిక తీర్థయాత్రల్లో కాన్హా శాంతి వనానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. శ్రీ రామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్ మాట్లాడుతూ.. మహిళలను అన్ని రంగాల్లో ఉన్నత స్థితికి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పలువురు మహిళలకు పొదుపు ఖాతాలకు సంబంధించిన సేవింగ్ బ్యాంకు పాస్ పుస్తకాలను అందజేశారు.

పోస్టల్ స్టాంప్ విడుదల

శ్రీ రామచంద్ర మిషన్ గురూజీ, హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ గ్లోబల్ గైడ్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమ్లేష్ పటేల్ (దాజీ) ఫొటోతో ఉన్న పోస్టల్ స్టాంపును దాజీతో కలిసి కేంద్ర మంత్రి విడుదల చేశారు. అంతకు మందు ధ్యానం చేశారు.

డాక్యుమెంట్ రైటర్ హత్య

- కిడ్నాప్ చేసి చావబాదిన ప్రత్యర్థులు
- స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రికి తరలింపు
- అక్కడ చనిపోయాడని చెప్పడంతో పరారీ
- నిందితులు బీఆర్ఎస్ ఎంపీపీ సోదరులు, అనుచరులు



కరుణాకర్‌రెడ్డి (ఫైల్)

కొత్తూరు: ఆర్థికపరమైన లావాదేవీలు, పాతకక్షలతో డాక్యుమెంట్ రైటర్, మాజీ విలేకరి మామిడి కరుణాకర్‌రెడ్డి హత్యకు గురయ్యాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులో సోమవారం వెలుగుచూసిన ఘటనపై పోలీసుల వివరాలిలా.. కొత్తూరు మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డికి అధికార పార్టీ బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీపీ మధుసూదన్‌రెడ్డితో కొంతకాలంగా ఆర్థికపరమైన గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై ఇద్దరూ పలుమార్లు పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. కరుణాకర్‌రెడ్డి కదలికలపై మధుసూదన్‌రెడ్డి సోదరులు విక్రమ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అనుచరులు ఆరిఫ్, అరుణ్‌రెడ్డి నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కరుణాకర్‌రెడ్డి తీగాపూర్ నుంచి మల్లాపూర్‌కు తన సమీప బంధువు శ్రీకాంత్‌రెడ్డి కారులో వస్తున్నాడని సమాచారం అందడంతో మార్గమధ్యలో కాపుకాసి అతడిని కిడ్నాప్ చేశారు. తమ కారులో ఎక్కించుకొని దాడికి పాల్పడ్డారు. దెబ్బలకు స్పృహ కోల్పోయిన కరుణాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో ప్రమాదం జరిగిందని చెప్పి అడ్మిట్ చేశారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించగా.. నిందితులు అక్కడి నుంచి జారుకున్నారు.



నిందితులను శిక్షించాలని రోడ్డుపై ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, నాయకులు

నిందితులను అరెస్టు చేయాలంటూ ధర్నా

అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి మధుసూదన్‌రెడ్డి సోదరులు, అనుచరుల చేతిలో హత్యకు గురైన కరుణాకర్‌రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని కోరుతూ కాంగ్రెస్ నేతలు వీర్లపల్లి శంకర్, కే. శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి. మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి పాత జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకోలు నిర్వహించారు. కాగా తన కుమారుడ్ని దారుణంగా హత్యచేసిన దుండగులను అరెస్ట్ చేసి జైలుకు తరలించే వరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించవద్దని మృతుడి తల్లి స్వరూప పోలీసులను కోరింది. ఆర్థికపరమైన లావాదేవీల కారణంగానే హత్య జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చామని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి ఎంపీపీ సస్పెండ్

కాగా, డాక్యుమెంట్ రైటర్ కరుణాకర్‌రెడ్డి కిడ్నాప్, హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. తమది క్రమశిక్షణ గల పార్టీ అని, నేరాలు, హత్యలు చేసే వారికి చోటు ఉండదన్నారు.

దేశంలోనే ఆదర్శంగా తెలంగాణ

మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడపిల్లలకు మేనమామగా మా రారని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో 539 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్‌లను జల్‌పల్లిలోని మరాఠ భవన్‌లో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాలుగేళ్ల కాలంలో ఒక్క జల్‌పల్లి మున్సిపాలిటీలోనే మూడు వేల మంది లబ్ధిదారులకు రూ.34 కోట్లు అందించామన్నారు. ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతు బీమా పథకాలతో దేశంలోనే ఆదర్శంగా తెలంగాణ నిలిచిందన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో వందలాది కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. మరిన్ని ప్రత్యేక నిధులు రాబట్టి మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో కందుకూర్ ఆర్డీవో సూరజ్‌కుమార్, జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది, బాలాపూర్ తహసీల్దార్ జనార్దన్ రావు, జల్‌పల్లి కమిషనర్ వసంత, కో-ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు బుడుమాల యాదగిరి, పల్లపు శంకర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితా రెడ్డి

ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

- డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తే లాభాల బాటలో ఉంటామని డీసీసీబీ చైర్మన్ బియ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.7.29 కోట్ల లాభాన్ని ఆర్జించినట్లు తెలిపారు. నగరంలోని డీసీసీబీ కార్యాలయంలో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లోని సహకార సంఘాల సెక్రటరీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణాల పంపిణీ, వసూళ్లలో మంచి పురోగతి సాధించినట్లు చెప్పారు. ఈ నెల నుంచి దీర్ఘకాలిక రుణాలు, పంట రుణాల టార్గెట్‌ను రూ.200 కోట్లుగా నిర్ధారించినట్లు వెల్లడించారు. వచ్చేఏడాది రూ.1,800 కోట్ల టర్నోవర్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సంఘాల మూల ధనానికి 6 శాతం డివిడెంట్(వడ్డీ)ను ఎఫ్‌డీ రూపంలో సెక్రటరీలకు అందజేశామన్నారు. ప్రాథమిక సంఘాల వ్యాపార అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గత రెండేళ్లలో ఆయా సంఘాల పరిధిలో గోదాములు, రైస్‌మిల్లుల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలకు రూ.75 కోట్లు వెచ్చించినట్లు వివరించారు. జూన్‌లోగా ఆయా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసినట్లు నాబార్డ్ డీడీఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నాబార్డు ద్వారా అందజేస్తున్న వివిధ రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, జీఎం రియాజుద్దీన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గందరగోళంగా రెవెన్యూ వ్యవస్థ



సదస్సులో మాట్లాడుతున్న నిరూప్‌రెడ్డి

- భూ చట్టాల్లోని లొసుగులతో రికార్డుల నమోదులో అక్రమాలు
- సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి

యాచారం: తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ గందరగోళంగా మారిందని, భూ చట్టాల్లోని లొసుగులతో రికార్డుల నమోదులో అనేక అక్రమాలు జరుగుతున్నాయని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలు తెలుసుకోవడానికి రైతులతో ముఖాముఖిలో భాగంగా సోమవారం యాచారం నుంచి లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ భూమి రెండో విడత కారవాన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అనేక రాష్ట్రాల్లో భూ చట్టాల్లో తేడాలున్నాయని అన్నారు. తెలంగాణలో అనేక భూ చట్టాలు ఉండడంతో వాటి లొసుగులతో రికార్డుల నమోదులో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, పేద రైతులకు తమ భూములపై హక్కులు పొంది పట్టాదారు, పాసుపుస్తకాలు దక్కించుకోవడం కష్టంగా మారిందన్నారు. రెవెన్యూ రికార్డుల నమోదులో నిర్లక్ష్యంతోనే భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 48 గంటల్లోనే హద్దులతో కూడిన పట్టాదారు, పాసుపుస్తకాలను రైతులకు అందజేస్తోందని అభినందించా రు.దేశం మొత్తం ఏపీ మాదిరిగా భూ సర్వే, హద్దుల ప్రక్రియను అమలు చేయాలని ఆకాంక్షించారు.

జూన్ 2న భూ సమస్యల నివేదిక

రాష్ట్రంలో లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో 33 జిల్లాల్లో 2,500 కిలోమీటర్లు, 800 గ్రామాల్లో పర్యటించి 10 వేల మంది రైతులను కలిసి భూ సమస్యలు తెలుసుకున్నట్లు నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్, ప్రముఖ న్యాయవాది సునీల్‌కుమార్ పేర్కొన్నారు. తాజాగా తిరిగి ఏప్రిల్ 10న భూదాన్ పోచంపల్లిలో తెలంగాణ భూమి కారవాన్‌ను ప్రారంభించి మొదటి విడతగా మల్లేపల్లి వరకు 112 కిలోమీటర్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రెండో విడత కింద సోమవారం యాచారం నుంచి నల్లగొండ జిల్లా చిట్యాల వరకు 108 కిలోమీటర్లు పర్యటించి వందలాది మంది రైతుల భూ సమస్యలు తెలుసుకుంటామన్నారు. జూన్ 2న భూదాన్ పోచంపల్లిలో భూ సమస్యల నివేదికను ప్రకటిస్తామని వెల్లడించారు. రైతుల భూ సమస్యలు తెలుసుకుని, సూచనలు, సలహాలు ఇవ్వడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. సమావేశంలో పాశం యాదగిరి, కరుణాకర్‌రెడ్డి, పిట్టల శ్రీశైలం, మర్రి నిరంజన్‌రెడ్డి, దెంది రాంరెడ్డి, రెడ్డి వెంకట్‌రెడ్డి, తాడిపర్తి సర్పంచ్ దూస రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడతకు రెడీ

- గొర్రెకాపరుల నిరీక్షణకు తెర
- గొర్రెల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- ఈనెలాఖరు వరకు అందించేలా అధికారుల కసరత్తు
- పెరిగిన ధరలకు అనుగుణంగా యూనిట్ ధర పెంపు

చేవెళ్ల: నాలుగేళ్లుగా బ్రేక్‌పడిన గొర్రెల పంపిణీ పథకం రెండో విడతకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఈనెలాఖరు వరకు ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. కులవృత్తులు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. 75శాతం రాయితీతో లబ్ధిదారుడికి మొదటి విడత రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేసింది. రెండో విడత పంపిణీకి సంబంధించి యూనిట్ల గుర్తింపు జరిగినా పంపిణీ కాలేదు. ఎప్పుడెప్పుడా అని గొల్లకురుమలు ఎదురుచూస్తున్నారు. వారి నిరీక్షణ ఫలించి ప్రభుత్వం ఇటీవల రెండో విడత పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. పెరిగిన ధరలకు అనుగుణంగా యూనిట్ ధరలను కూడా పెంచింది. మొదటి విడతలో జరిగిన లోటుపాట్లను రెండో విడతలో లేకుండా చూసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

లక్ష్యం 30,009 యూనిట్లు

జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ పథకం ద్వారా గొల్లకురుమలకు 30,009 యూనిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం 2018లో తొలిసారిగా గొర్రెల పెంపకందారులను ఆదుకునేందుకు రాయితీపై యూనిట్లు మంజూరు చేసింది. 18 ఏళ్లు నిండివారు గొర్రెల సహకార సంఘంలో సభ్యత్వం తీసుకొని ఉంటే అర్హులని చెప్పింది. లబ్ధిదారుల ఎంపికలో కలెక్టర్ చైర్మన్‌గా, పశుసంవర్ధకశాఖ అధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. మండల స్థాయిలో లబ్ధిదారులను ఎంపిక చేయటంతోపాటు కొనుగోలుకు సంబంధించిన పూర్తి బాధ్యత మండల కమిటీదే. ఇందులో మండల అభివృద్ధి అధికారి, తహసీల్దార్, మండల పశువైద్యాధికారి ఉంటారు. లబ్ధిదారులకు కేటాయించిన గొర్రెలు, పొట్టేళ్లను పక్క రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి అందించాలి. నేరుగా నగదు ఇవ్వకుండా వారి సమక్షంలో ప్రభుత్వమే కొనుగోలు చేసి అందించేలా ఏర్పాటు చేసింది. ప్రభుత్వమే రవాణ, బీమా ఖర్చులు భరిస్తోంది. జిల్లాలో మొదటి విడత 20,685 యూనిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించినా 11, 685 యూనిట్లు మాత్రమే పంపిణీ చేసింది. అప్పట్లో లబ్ధిదారులకు అందించిన యూనిట్లు అమ్ముకున్నారే ఆరోపణలు వచ్చాయి. గొర్రెల యూనిట్ల కొనుగోలుకు సైతం పక్క రాష్ట్రాలపై ఆధారపడటంతో అక్కడ గొర్రెలకు డిమాండ్ పెరిగింది. దీనికి తోడు డీజిల్, పెట్రోల్‌ధరలు పెరగడంతో గొర్రెల ధరలను కూడా పెంచేశారు. పథకం ప్రవేశపెట్టినప్పుడు ఉన్న ధరలు పంపిణీ చేసే సమయంలో పెరగటంతో గొర్రెల పంపిణీ పథకానికి బ్రేక్‌లు పడ్డాయి.



పెంచిన యూనిట్ ధరలు

పెరిగిన ధరలకు అనుగుణంగా మొదటి విడతలో జరిగిన లోటుపాట్లను సరిచేసుకుంటూ రెండో విడత పంపిణీకి అధికారులు సిద్ధమవుతున్నారు. దీనికి అనుగుణంగానే ప్రభుత్వం యూనిట్ ధరలు పెంచింది. గతంలో యూనిట్ ధర 1.25 లక్షలుగా నిర్ణయించిన విషయం తెలిసిందే. బ్యాంకుతో సంబంధం లేకుండా 70శాతం రాయితీతో లబ్ధిదారులకు గొర్రెలను మంజూరు చేసింది. రాయితీ పోను లబ్ధిదారుడు మిగతా సొమ్ము రూ.31,250 చెల్లిస్తే రూ.93,750 భరించి 20 గొర్రెలు,ఒక పొట్టేల్‌ను ఒక యూనిట్ కింది మంజూరు చేసింది. ప్రస్తుతం ఒక యూనిట్ విలువను రూ.1.75 లక్షలకు పెంచింది. దీంతో లబ్ధిదారుడి వాటా రూ.43,750కు పెరిగింది. ప్రభుత్వం రూ.1,31,250 సబ్సిడీ అందిస్తోంది.

సంతోషకరం



ప్రభుత్వం తెచ్చిన గొర్రెల పంపిణీ పథకంతో ఎంతో మంది ఆర్థికంగా అభివృద్ధి చెందారు. రెండో విడత పంపిణీకోసం చాలామంది ఎదురుచూస్తున్నారు. వారికి త్వరలో అందించేందుకు ప్రభుత్వం ముందుకురావటం సంతోషకరం. గొర్రెల పంపిణీకి యూనిట్లు కాకుండా నగదు ఇవ్వాలని కోరాం. దీనిపై ఆలోచన చేస్తుందని ఆశిస్తున్నాం.

– కసిరె వెంకటేశ్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు, చేవెళ్ల

ఆదేశాలు రాగానే పంపిణీ



రెండో విడత గొర్రెల పంపిణీకి సబంధించి ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో 30,009 యూనిట్లుపంపిణీ లక్ష్యంగా ఉంది. దీనికి సంబంధించి కావాల్సిన గొర్రెలను ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. మొదటి విడతలో జరిగిన లోటుపాట్లు రెండో విడతలో లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తాం.

– అంజిలప్ప, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

పథకాల అమలులో మనమే ఆదర్శం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశంలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ముస్లింలకు ప్రభుత్వం తరఫున రంజాన్ కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రభుత్వం కూడా కల్యాణలక్ష్మి, షాదీమురక్ వంటి పథకాలు అమలు చేయడం లేదన్నారు. ఈ పథకాల ద్వారా పేదింటి యువతుల వివాహాలకు రూ. 1,00,116 అందజేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. అన్నదాతల కోసం రైతు బంధు, రైతు బీమా పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని గుర్తు చేశారు. సీఎం సహాయ నిధి ద్వారా నియోజవర్గానికి అధిక నిధులు తెచ్చి పేదలను ఆదుకోవడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ డీ గోవర్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ సీ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీడీవో వెంకయ్యగౌడ్, తహసీల్దార్ నయిమొద్దీన్, కమిషనర్ జ్ఞానేశ్వర్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు

చేవెళ్ల: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్లలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం వెంకట రంగారెడ్డి, వైస్ చైర్మన్ బీ నర్సింలు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శివారెడ్డి, సర్పంచులు శైలజ, మల్లారెడ్డి, శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు టీ చంద్రశేఖర్, నాయకులు ఎం కృష్ణారెడ్డి, పీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలనే ప్రభుత్వం కానుకలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాజేశ్, నాయకులు బాసిత్, ఖాదర్, గని తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్


అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం అందజేస్తున్న ఇబ్రహీం

వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఇబ్రహీం

షాద్‌నగర్ రూరల్: సమాజంలో నిరుపేద అణగారిన వర్గాల అభ్యున్నతికి బాబా సాహెబ్ అంబేడ్కర్ తన జీవితాన్ని అంకితం చేశారని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఎండీ ఇబ్రహీం అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం బురెడ్డిపల్లిలో ఈ నెల 26న నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సోమవారం పట్టణంలోని వైఎస్సార్ టీపీ కార్యాలయంలో విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారని అన్నారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు, ఫలాలు దక్కాలనే ఆలోచనతో భారత రాజ్యాంగాన్ని రచించిన మహనీయులు అంబేడ్కర్ అన్నారు. నేటి తరానికి ఆయన స్ఫూర్తి ప్రదాత అన్నారు.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి

కొత్తూరు: కొత్తగా నిర్మిస్తున్న ఓ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పశ్చిమగోదావరి జిల్లా, యాలమంచుల గ్రామానికి చెందిన ఆర్ రమేష్(38) కొన్నేళ్ల నుంచి కొత్తూరులో నివాసం ఉంటూ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా ఉదయం పెంజర్ల రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంట్లో టైల్స్ వేసేందుకు వచ్చాడు. ఈ క్రమంలో తన చేతిలోని సెల్‌ఫోన్ నీటి సంపులో పడిపోయింది. దాన్ని తీసే క్రమంలో అందులో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుని బంధువు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న లక్ష్మీనారాయణగౌడ్

కేశంపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లింగంధన గ్రామానికి చెందిన ఎస్ నెహ్రూ(28) గత శనివారం జడ్చర్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నెహ్రూని కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. అయితే నెలరోజుల క్రితమే నెహ్రూకి వివాహం జరిగింది. మృతుడి కుటుంబాన్ని జెడ్పీటీసీ టీ విశాల, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వీ లక్ష్మీ నారాయణగౌడ్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

ఆధునిక వ్యవసాయం లాభదాయకం

మంచాల: వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆధునిక పద్ధతుల్లో పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాస్త్ర వేత్తలు డాక్టర్ వై. శ్రీధర్, డాక్టర్ అమ్తుల్ వారిస్ రైతులకు సూచించారు. సోమవారం స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్‌లో భాగంగా మంచాల గ్రామంలో వరి చేలపై డ్రోన్ ద్వారా క్రిమి సంహారక మందుల పిచికారిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రోన్ ద్వారా క్రిమి సంహారక మందుల పిచికారి చేస్తే సమయం ఆదా అవుతుందని, కూలీల కొరతను కూడా అధిగమించవచ్చన్నారు. భారతీయ వరి పరిశోధన స్థానం రాజేంద్రనగర్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వ్యవశాయ శాఖ మండల అధికారి జ్యోతిశ్రీ, ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, సర్పంచ్ ఏ జగన్‌రెడ్డి, గ్రామ కో-ఆప్షన్ సభ్యుడు ఏ బాలరాజ్, రైతులు మంత్రి నర్సింహ, స్వరూప, భాషయ్య, శివయ్య, యాదగిరి, నర్సింహ, శ్రీశైలం, గాలయ్య, వెంకటేశ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్ ద్వారా క్రిమి సంహారక మందు పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పహాడీషరీఫ్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఉప్పుగూడ హనుమాన్‌నగర్‌కు చెందిన తుపాకుల బాలరాజ్ కుమారుడు చంద్రశేఖర్ చారి(20) పదో తరగతి వరకు చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆదివారం తన ముగ్గురు స్నేహితులు రితేష్, వెంకట్‌రెడ్డి, విష్ణువర్ధన్‌లతో కలిసి బైక్‌లపై మైసిగండి అమ్మవారి దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2.30 గంటలకు ఇజ్తేమా గ్రౌండ్ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పింది. ఈ ఘటనలో రితేష్‌కు స్వల్ప గాయాలు కాగా చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. వీరి వెంట మరో బైక్‌పై వచ్చిన ఇద్దరు కూడా ప్రమాదానికి గురైన బైక్‌ను ఢీకొని గాయపడ్డారు. చంద్రశేఖర్‌ను యశోద ఆస్పత్రికి తరలించగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భూమి ఆక్రమించిన వారిపై కేసు

కడ్తాల్: భూమి ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేసిన సంఘటన సోమవారం కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ హరిశంకర్ గౌడ్ తెలిపిన వివరాలు.. అన్మాస్‌పల్లి సమీపంలోని సర్వే నంబర్ 260లో రెండు రోజుల క్రితం పత్తి రవి కుమార్, అతని అనుచరులు అక్రమంగా ప్రవేశించి, రాతీ కడ్డీలు విరగొట్టి భూమిని చదును చేశారు. సదరు సర్వే నంబర్‌లో గల భూమి తమదని, అన్మాస్‌పల్లి చెందిన కే నరేందర్‌రెడ్డి, అతని బంధువులు భూమి పత్రాలతో వచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి వాముల దగ్ధం

కందుకూరు: ప్రమాదవశాత్తు రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన మండలంలోని దాసర్లపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఏ సత్తయ్య పశువుల మేత నిమిత్తం రెండు గడ్డి వాములు వేసుకున్నాడు. సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు రెండు గడ్డి వాములు కాలిపోయాయి. దాదాపు లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.


మంటలను ఆర్పుతున్న రైతు కుటుంబం

డంప్ యార్డులను పూర్తి చేయండి

జీహెచ్ఎంసీకి ఎన్‌జీటీ ఆదేశం

యాచారం: శివారు ప్రాంతాల్లో ఉన్న దుండిగల్, ప్యారానగర్, యాచారం కేంద్రాల్లో ఘన వ్యర్థాల డంపింగ్ యార్డులను వెంటనే పూర్తి చేయాలని జీహెచ్ఎంసీని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశించింది. డంపింగ్ యార్డుల ఏర్పాటు నిర్లక్ష్యంపై కొద్ది రోజుల కింద ఎన్‌జీటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పనుల్లో జాప్యాన్ని గమనించిన ఎన్‌జీటీ.. ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించింది. జవహర్‌నగర్‌పై భారాన్ని తగ్గించేందుకు గాను ఈ మూడు డంప్ యార్డులను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ప్రాజెక్టును ఏడాది సమయంలోనే పూర్తి చేయాలని గతంలో గ్రీన్ కోర్టుకు సమర్పించారు. అయితే సమయపాలనకు కట్టుబడి ఉండాలని ఎన్‌జీటీ జీహెచ్ఎంసీని ఆదేశించింది. అలాగే.. పర్యావరణ పరిరక్షణకు జీహెచ్ఎంసీ తీసుకుంటున్న చర్యలపై నివేదిక సమర్పించాలని కోరింది. కాగా, దుండిగల్ వద్ద విద్యుత్ తీగలను భూగర్భంలోకి మార్చడంతో జాప్యం జరిగిందని, ఏప్రిల్ చివరి నాటికి ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని జీహెచ్ఎంసీ వివరణ ఇచ్చింది. అదే విధంగా ప్యారానగర్‌లో చెట్ల నరికివేత, అప్రోచ్ రోడ్డు వేయడానికి, నిర్మాణం పూర్తి చేయడానికి ఆరు నెలల సమయం పడుతుందని పేర్కొంది.


యాచారంలో డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం నిర్ణయించిన స్థలమిదే..

యాచారం వద్ద ఎనర్జీ ప్లాంట్

నాగార్జునసాగర్ - హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రానికి కూత వేటు దూరంలో వేస్ట్ టు-ఎనర్జీ ప్లాంట్ సామర్థ్యంతో కూడిన డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జవహర్‌నగర్ నుంచి చెత్తను తెచ్చి యాచారం సమీపంలో 12 నుంచి 14 మెగావాట్ల విద్యుత్ తయారయ్యే ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం కోసం జీహెచ్ఎంసీ రెండేళ్ల సమయాన్ని కోరింది. మూడేళ్ల కిందటే యాచారంలో చెత్త డంపింగ్ యార్డు నిర్మాణం అవుతుందని తెలిసి స్థానికులు ఆందోళన చెపట్టారు. దీంతో సద్దుమణిగిందని అనుకుంటున్న సమయంలో తాజాగా ఎన్‌జీటీ ఆదేశాలతో యాచారంలో డంపింగ్ యార్డు ఏర్పాటు అవుతుందనే ప్రచారం స్థానికుల్లో భయాందోళన కలిగిస్తోంది. యాచారం రెవెన్యూ పరిధిలోనే మైనింగ్ జోన్ ఏర్పాటుతో స్టోన్ క్రషర్లు, క్వారీల ఏర్పాటుపై స్థానికుల ఆందోళనతో స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్పందించి మైనింగ్ జోన్‌ను రాకుండా కృషి చేశారు. తాజాగా డంపింగ్ యార్డు వస్తుందనే విషయం తెలియడంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి డంపింగ్ యార్డు ఏర్పాటు కాకుండా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాలికను హత్య చేసింది మేనమామే

- ఇతరులతో చనువుగా ఉంటోందని కక్ష
- అత్యాచారం చేసి ఆపై హత్య
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి


నిందితుడు విష్ణు

శంషాబాద్: అదృశ్యమై ముళ్లపొదల్లో శవంగా లభ్యమైన మైనర్‌బాలిక హత్య కేసు మిస్టరీ వీడింది. సొంత మేనమామే అత్యాచారం చేసి ఆపై హత్యకు పాల్పడ్డ దారుణం బయటపడింది. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వనపర్తి జిలా కొత్తకోట మండలం పాలెం గ్రామానికి చెందిన దంపతులు రెండేళ్లుగా పట్టణంలోని మధురానగర్ కాలనీలో నివాసముంటు కూలీ పనులు చేస్తూ బతుకుతున్నారు. ఈ నెల 11న వీరి కుమార్తె (16) ఇంట్లో నుంచి అదృశ్యమైంది. ఈ నెల 14న రాళ్లగూడ సర్వీసు రహదారి పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రాంతమైన ముళ్లపొదల్లో బయటపడ్డ మృతదేహం బాలికదిగా తల్లిదండ్రులతో పాటు పోలీసులు నిర్ధారించుకుని ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీతో పాటు స్థానికంగా ఉన్న ఇతర సమాచారం మేరకు బాలిక తల్లి సోదరుడు జట్ప్రోలు విష్ణు (23)ను పాలెం గ్రామంలో పోలీసులు అరెస్ట్ చేసి విచారణ ప్రారంభించడంతో అసలు విషయం బయటపడింది. గత ఏడాదిగా విష్ణు మేనకోడలుతో సఖ్యతగా..సన్నిహితంగా ఉన్నాడు. గత కొన్ని నెలలుగా బాలిక ఇతరులతో చనువుగా ఉండడంతో విష్ణు ఆమెపై కక్ష పెంచుకుని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు ఈ నెల 11న సాయంత్రం బాలికను బయటికి రావాలని కోరాడు. రాళ్లగూడ సర్వీసు రహదారి పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లిన తర్వాత బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత అక్కడే ఉన్న బండరాయితో తలపై మోదాడు. మృతిచెందినట్లు నిర్ధారించుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. శంషాబాద్ ఏసీపీ భాస్కర్ ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు సుమన్, తరుణ్‌లు కేసు ఛేదించిన తీరును డీసీపీ ఈ సందర్భంగా అభినందించారు.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ ఓటమి

సాక్షి, హైదరాబాద్: సూపర్ కప్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నుంచి హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు నిష్క్రమించింది. కేరళలో జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ 0-1 గోల్ తేడాతో రౌండ్‌గ్లాస్ పంజాబ్ జట్టు చేతిలో ఓడిపోయింది. కోజికోడ్‌లో బెంగళూరు ఎఫ్‌సీ, కేరళ బ్లాస్టర్స్ జట్ల మధ్య మ్యాచ్ 1-1తో 'డ్రా'గా ముగియడంతో ఐదు పాయింట్లతో బెంగళూరు గ్రూప్ టాపర్‌గా నిలిచి సెమీఫైనల్‌కు చేరుకుంది. శ్రీనిధి జట్టు నాలుగు పాయింట్లతో గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంలో నిలిచింది.

డా. సుధీర్ దారాకు ఇండియా బ్రాండ్ ఐకాన్ అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: విశేష వైద్య సేవలందిస్తున్న పెయిన్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ సుధీర్ దారా 2022-23 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక 'ఇండియా బ్రాండ్ ఐకాన్' అవార్డును అందుకున్నారు. ముంబైలో ఈ నెల 14వ తేదీన జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖ అంతర్జాతీయ క్రికెట్ ఆటగాడు బ్రెట్‌లీ ఈ అవార్డు అందజేశారు. ప్లాస్మా థెరపీ ద్వారా కండరాల నొప్పి సమస్యలను పరిష్కరిస్తున్న డా.సుధీర్ దాదాపు 5 వేల మంది డాక్టర్లకు ప్లాస్మాథెరపీలో శిక్షణనిచ్చారు. హైదరాబాద్‌లో మల్టీ డిసిప్లినరీ పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్ 'ఎపియోన్ పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్ అండ్ రీజెనరేటివ్ క్లినిక్'ను ప్రారంభించిన ఆయన దీర్ఘకాలిక నొప్పులతో బాధపడుతున్న వారికి అత్యాధునిక విధానాలతో శరీరానికి కోతలు లేకుండా చికిత్సలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 15వేల మందికి పైగా దీర్ఘకాలిక మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి శస్త్రచికిత్సలు లేకుండా ప్లాస్మా థెరపీతో చికిత్సలు చేశారు. ప్రస్తుతం చెన్నయ్, ఇండోర్, వైజాగ్‌లకు విస్తరించిన ఎపియోన్ పెయిన్ మేనేజ్‌మెంట్ కేంద్రాలు త్వరలో దుబాయ్, తూర్పు అమెరికాల్లోనూ ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ సుధీర్ పేర్కొన్నారు.